క్లుప్తంగా

ఎన్‌సీసీతో క్రమశిక్షణ



ఉయ్యూరు: ఎన్‌సీసీతో క్రమశిక్షణ అలవడుతుందని శ్రీవిశ్వశాంతి విద్యాసంస్థల చైర్మన్ మాదల సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. పట్టణంలోని శ్రీవిశ్వశాంతి విద్యాసంస్థల్లో సోమవారం ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 16వ ఆంధ్రా బెటాలియన్ కెప్టెన్ వేమూరి ఎలిజిబెత్ రాణి ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం శిరీషా మానసిక దివ్యాంగుల కేంద్రాన్ని సందర్శించి పండ్లు, బిస్కెట్లు, నిత్యావసరాల కిట్లను అందజేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ మాదల సూర్యశేఖర్, ప్రిన్సిపాల్ పద్మజావాణి తదితరులు పాల్గొన్నారు.

కంటి సంరక్షణ చాలా ముఖ్యం



కంకిపాడు: కంటి సంరక్షణ చాలా ముఖ్యమని లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్‌పర్సన్ బండి జ్యోతి అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ కంకిపాడు ఆధ్వర్యంలో మాక్సివిజన్ విజయవాడ ఆధ్వర్యాన కంకిపాడు జెడ్పీ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 450 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేయగా, 35 మందికి కళ్లజోళ్లు అవసరమని నిర్ధారించారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా చైర్‌పర్సన్‌లు బండి నాంచారయ్య, సీహెచ్ శంకర్‌రావు, జిల్లా కార్యదర్శి మద్దుల గోవిందరావు, క్లబ్ అధ్యక్షుడు వీ శివరామకృష్ణ, కార్యదర్శి మద్దుల యుగంధర్, కోశాధికారి ఎస్ నిహార్, ప్రతినిధులు వీ భార్గవి, మద్దుల త్రివిక్రమరావు, డాక్టర్ మద్దుల శశికళ, డాక్టర్ మూర్తి, హెచ్ఎం జీబీకే సుధారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి విగ్రహావిష్కరణ



పెనమలూరు: వాసవీక్లబ్ నవనిర్మాణ్ కపుల్స్ ఆధ్వర్యంలో పోరంకిలో సోమవారం శ్రీసరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. స్థానిక ఎస్ఆర్ పాఠశాలలో వాసవీక్లబ్ గవర్నర్ కొత్త గణేష్‌బాబు సర్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ గవర్నర్ అన్నం సాయిసునీత, జోన్ చైర్‌పర్సన్ కారంశెట్టి వెంకటమస్తానయ్య, క్లబ్ అధ్యక్షురాలు రాచమడుగు మానస, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు విద్యార్థులు



గన్నవరం: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు గన్నవరానికి చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ ప్రాంగణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు బి. లక్ష్మీదుర్గ, పి. కీర్తి, బి. మేఘన, ఇ. సాహితి అండర్-19 విభాగంలో ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పి. ఉమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలకు చెందిన విద్యార్థి ఎ. రెహాన్ ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావు తెలిపారు. వీరందరూ ఈ నెల 26 నుంచి 28 వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిథ్యం వహించనున్నారు.

వైభవంగా ముగిసిన భోగ శ్రీనివాసమూర్తి సంప్రోక్షణ



విజయవాడకల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో విజయవాడ పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపం ప్రాంగణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో భోగశ్రీనివాసుని సంప్రోక్షణ కార్యక్రమాలు సోమవారం ముగిశాయి. భక్తులు గోవిందనామాలు ప్రతిధ్వనిస్తూ ఉండగా వేద పండితులు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. మహాపూర్ణాహూతి యాత్రదానం వరకు జరిగే వైదిక క్రతువు, కళావాహన, అక్షతారోహణ, బ్రహ్మఘోష తదితర కార్యక్రమాలను టీటీడీ ఆగమ శాస్త్ర పండితులు నల్లూరి మోహన వెంకట రంగాచార్యులు, కామకన భట్టార్, ఆర్‌బీఎంకేఎస్ అయ్యన్న, సూర్యకుమారా చార్యులు నిర్వహించారు. అర్చకులను దేవాలయం అధికారులు సత్కరించారు. కార్యక్రమాలను టీటీడీ దేవస్థాన ఇన్‌స్పెక్టర్ సీహెచ్ లలితా రమాదేవి పర్యవేక్షించారు.

ఎట్టకేలకు సమకూరుతున్న వసతులు

- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రణాళికలు
- మెరుగుపడుతున్న ఈడుపుగల్లు బాలుర వసతి గృహం



ఈడుపుగల్లు బాలుర వసతి గృహం

కంకిపాడు: వసతి గృహంలో వసతులు సమకూరుతున్నాయి. విద్యాభివృద్ధికి, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పన సమర్థంగా సాగుతుండటంతో ఈడుపుగల్లు సాంఘిక సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహం విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ఈడుపుగల్లు కేంద్రంలో ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ బాలుర కళాశాల వసతిగృహం నడుస్తోంది. ఈ వసతి గృహంలో 59 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. డిగ్రీ, పాలిటెక్నిక్, బీటెక్ వంటి ఉన్నత విద్యా కోర్సులను విద్యార్థులు అభ్యసిస్తున్నారు. విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, అనంతపురం, వైఎస్సార్ కడప జిల్లాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులు ఇక్కడ వసతి పొందుతున్నారు.

కథనాలతో స్పందించిన అధికారులు

సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దృష్టి సారించింది. ఎన్నికల సమయంలో అప్పటి జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో వసతుల కల్పనకు అవసరమైన ప్రాథమిక నివేదికలు రూపొందించారు. దీనిలో భాగంగా ఈడుపుగల్లు బాలుర కళాశాల వసతి గృహంలో వసతుల కల్పనకు అధికారులు రూ. 2.40 లక్షలతో అంచనాలు రూపొందించారు. అయితే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో నిధులు విడుదల జాప్యం అయ్యింది. తదనంతరం వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలపై పలుమార్లు 'సాక్షి' నిర్వహించిన సందర్శనలు, ప్రచురించిన కథనాలతో అధికారులు స్పందించారు. తాజాగా రూ. 10.90 లక్షల అంచనాతో అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు నిధులు కేటాయించారు. మొత్తంగా రూ. 13.30 లక్షల నిధులు ఈడుపుగల్లు వసతి గృహానికి కేటాయింపులు జరిగాయి. ఈ నిధులతో ఇప్పటికే రెండు వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకులు ఏర్పాటుచేశారు. ఆరు మరుగుదొడ్లు అందుబాటులోకి తెచ్చారు. బాత్రూమ్‌లు, ఇతర అవసరాలకు నీటి వసతి కల్పించారు. వసతి గృహంలో ఉన్న అన్ని గదుల్లో ఫ్యాన్‌లు, ఫ్లోరింగ్ మరమ్మతులు, విద్యుదీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. సాంఘిక సంక్షేమశాఖ డీడీ షాహిద్‌బాబు పర్యవేక్షణలో మరమ్మతు పనులు సమర్థంగా సాగుతున్నాయి. వసతుల కల్పన సజావుగా సాగుతుండటం, సమస్యలు పరిష్కారం అవుతుండటంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



మెరుగుపడ్డ రన్నింగ్ వాటర్ వసతి

సమర్థంగా వసతుల కల్పన



ఇక్కడ కళాశాల విద్యార్థులు వసతి పొందుతున్నారు. వీరికి అవసరమైన వసతులను కల్పించడంలో శాఖాపరంగా చర్యలు తీసుకుంటున్నాం. మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో పూర్తిస్థాయిలో వసతి గృహాన్ని ఆధునీకరించే చర్యలు తీసుకున్నాం.

– ఎం. దేవసహాయం, వార్డెన్, ఈడుపుగల్లు వసతి గృహం

ఉయ్యూరు కళాకారుడికి ప్రతిభా పురస్కారం



నాటక రంగ కళాకారుడు నాంచారయ్యకు పురస్కారం అందజేస్తున్న ప్రతినిధులు

ఉయ్యూరు: ఉయ్యూరుకు చెందిన నాటకరంగ కళాకారుడు ఎర్రపోతు వెంకట నాంచారయ్యకు ప్రతిభా పురస్కారం లభించింది. నాటక రంగంలో విశేష గుర్తింపు సాధించినందుకుగానూ అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ 2024కు ఈ పురస్కారాన్ని అందించింది. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 93వ జయంతి, సర్దార్ వల్లభాయ్ పటేల్ 140వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఏర్పాటుచేసిన పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆదివారం అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షురాలు డాక్టర్ ఎస్. సరోజినమ్మ అందించారు. పురస్కారం అందుకున్న నాంచారయ్యను దేవభక్తుల కోటేశ్వరరావు, దేవభక్తుల రామమోహన్‌రావు, పలువురు కళాకారులు సోమవారం అభినందించారు.

విద్యార్థి దశలోనే భవిష్యత్ లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: భవిష్యత్ లక్ష్యాన్ని విద్యార్థి దశలోనే నిర్ణయించుకుని, ఆ దిశగా పట్టుదల, ప్రణాళికతో కృషి చేయాలని మానవత స్వచ్ఛంద సంస్థ కన్వీనర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. బాపులపాడు మండలం మల్లవల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సత్ప్రవర్తన, సమయపాలన అలవర్చుకోవాలని చెప్పారు. విద్యార్థులు తమ ఆసక్తికి అనుగుణంగా ఏ ఉద్యోగ, ఉపాధి మార్గాన్ని ఎంచుకున్నప్పటికీ, ఆ రంగంలో విజయం సాధించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. పదవ తరగతి పరీక్షలు విద్యార్థుల భవిష్యత్‌కు ఎంతో కీలకమని అన్నారు. పది పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. గత ఏడాది ఆరు నుంచి తొమ్మిదవ తరగతి వార్షిక పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు మానవత ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ విద్యార్థులకు నగదు బహుమతితో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను మానవత సభ్యుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్షుడు గూడపాటి జయరామచంద్రరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: కానూరు సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతికాలనీ, వృద్ధుల ఆశ్రమం రోడ్డు, మాణిక్యనగర్, బీఎస్ఎన్ఎల్‌కాలనీ, జయరామ్‌టవర్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

రైతులు పంటల బీమా నమోదు చేసుకోవాలి

గన్నవరం: వ్యవసాయ శాఖ గన్నవరం సబ్‌డివిజన్ పరిధిలోని రైతులందరూ 2024–25 రబీ సీజన్‌కుగాను పంటల బీమా నమోదు చేసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎం. సునీల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రబీ సీజన్‌గాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పంటల బీమా పథకాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మినుము, వరి, మొక్కజొన్న, పెసర పంటలను ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం కింద ఎంపిక చేసినట్లుగా తెలిపారు. రబీ సీజన్‌లో బ్యాంక్‌ల ద్వారా పంట రుణాలు తీసుకున్న రైతులకు సదరు బ్యాంక్‌లు ప్రీమియం వసూలు చేసి బీమా కంపెనీకి నేరుగా చెల్లించడం జరుగుతుందన్నారు. రైతులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, పొలం పాస్‌బుక్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లు, పంట వేసిన ధ్రువపత్రాలతో కామన్ సర్వీస్ సెంటర్లలో ఆన్‌లైన్ ద్వారా ప్రీమియం చెల్లించి రశీదు పొందాలని సూచించారు. ఎకరానికి మినుముకు రూ. 80, పెసర రూ. 36, మొక్కజొన్న రూ. 84 చొప్పున డిసెంబర్ 15లోపు, వరికి రూ. 84 చొప్పున డిసెంబర్ 31లోపు ప్రీమియం చెల్లించాలని తెలిపారు. కౌలుకార్డు ఉన్న సాగుదారులు కూడా గడువులోపు ప్రీమియం చెల్లించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలకు గాయాలు



గాయాలతో అపస్మారకస్థితిలో రోడ్డుపై పడిపోయిన వృద్ధురాలు

పెనమలూరు: విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి బందరు రోడ్డు తాడిగడప సెంటర్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలకు గాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళితే.. తాడిగడప జంక్షన్ వద్ద వృద్ధురాలు, ఆమె కుమార్తె బందరు రోడ్డు దాటుతుండగా కంకిపాడు మండలం చలివేంద్రపాలెం గ్రామానికి చెందిన వ్యక్తి బైక్‌పై వస్తూ రోడ్డు దాటుతున్న మహిళలు ఇద్దరినీ ఢీ కొట్టాడు. ఈ ఘటనలో ఇద్దరు మహిళలకు గాయాలు అయ్యి రోడ్డుపై అపస్మారకస్థితిలో పడిపోయారు. గాయపడిన వారిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రోడ్డు ప్రమాద ఘటనతో బందరు రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఘటనా స్థలం వద్దకు సీఐ వెంకటరమణ, సిబ్బంది వచ్చి ట్రాఫిక్ క్లియర్ చేశారు. బాధితుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదానికి గురైన టీచర్‌కు ఆర్థిక తోడ్పాటు



నాగస్వప్న కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న నాగేశ్వరరావు, యూటీఎఫ్ నేతలు

గన్నవరం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ కాంట్రాక్ట్ ఉపాధ్యాయురాలికి యూటీఎఫ్ చొరవతో సహచర ఉపాధ్యాయులు అండగా నిలిచారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చిక్కవరం శివారు కండ్రికలోని ఎంపీపీ పాఠశాలలో సి.హెచ్. వెంకటనాగస్వప్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుంది. ఇటీవల ఆమె రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడి ఎనికేపాడులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితి కూడా అంతంతమాత్రం కావడంతో వైద్య చికిత్సల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆమె పరిస్థితి తెలుసుకున్న యూటీఎఫ్ మండల శాఖతో పాటు జిల్లా కోశాధికారి మరీదు రాంబాబు విజ్ఞప్తి మేరకు ఆమెకు సాయం చేసేందుకు సహచర ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. మొత్తం రూ. 1,11,500 నగదును సమీకరించి సోమవారం నాగస్వప్నకు మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. మానవత దృక్పథంతో ముందుకువచ్చి ఆర్థిక తోడ్పాటును అందించిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. సంఘ నేతలు డి. శివప్రసాద్, టి. శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, జ్ఞాననందం, జేమ్స్, నాగరాజు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నున్న–నూజివీడు రోడ్డులో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురైయ్యాయని.. ఈ ఆక్రమణలు గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నున్న గ్రామానికి చెందిన దండు సుబ్రహ్మణ్యరాజు ఎన్టీఆర్ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీశకు అర్జీ పత్రం సమర్పించారు. ఈ మార్గంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి రేకుల షెడ్డులు నిర్మించుకున్నారని ఫలితంగా ప్రధాన రహదారిలో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సమస్యపై పంచాయతీ, రోడ్లు, భవనాల అధికారులకు ఫిర్యాదు చేసినా.. ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు.

దళితుడిపై ఇసుక మాఫియా దాడి

పెనమలూరు పోలీస్‌స్టేషన్ ఎదుట దళితుల ధర్నా



పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న దళితులు

పెనమలూరు: పెనమలూరు పోలీస్‌స్టేషన్ ఎదుట సోమవారం రాత్రి దళితులు బైఠాయించి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. దీంతో పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఘటన వివరాలను బాధితుడు సురేష్, దళిత సంఘ నేతలు విలేకరులకు వెల్లడించారు. అక్రమ ఇసుక రావాణా చేసే ట్రాక్టర్లు వణుకూరు గ్రామంలో వేగంగా, అత్యంత ప్రమాదకరంగా వెళ్లడంతో గ్రామానికి చెందిన తోడేటి సురేష్ అభ్యంతరం తెలుపుతూ ఈ నెల ఏడవ తేదీన ట్రాక్టర్‌ను ఆపాడు. దీంతో చోడవరం గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని, టీడీపీ నాయకులు మోతుకూరి నాని, కొడాలి విష్ణువర్ధన్‌రావు, మురళీ మరికొందరు వ్యక్తులు వాహనంలో కర్రలు, రాడ్లతో వచ్చి సురేష్‌పై విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సురేష్ పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో దాడి ఘటనపై ఫిర్యాదు చేశాడు.

కేసుకట్టని పోలీసులు..

కాగా ఈ ఘటనపై బాధితుడు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు కట్టలేదు. అయితే సీఐ వెంకటరమణ సురేష్‌ను హెచ్చరిస్తూ నీపై గతంలో కేసులు ఉన్నాయని, రౌడీషీట్ తెరుస్తానని బెదిరించారని బాధితుడు తెలిపాడు. దళిత సంఘ రాష్ట్ర నాయకుడు కోటా డానియేల్ మాదిగ మాట్లాడుతూ 20 రోజులు గడిచినా పోలీసులు నేటివరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ఆరోపించారు. దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కాగా ఈ ఘటనపై పూర్వపరాలను పరిశీలించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపారు.

శైవక్షేత్రాల్లో కార్తిక శోభ

యనమలకుదురులో శాంతికల్యాణం



యనమలకుదురులో శ్రీరామలింగేశ్వరస్వామి ఊరేగింపు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో కార్తిక మాసం చివరి సోమవారం సందర్భంగా స్వామివార్లకు శాంతికల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం ఐదు గంటలకు రుద్రాభిషేకం, ఎనిమిది గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం జరిగింది. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. పల్లకీలో ఆలయ ప్రాంగణంలో స్వామివార్లను మేళతాళాలతో ఊరేగించారు. ఉదయం 10.30 గంటలకు శాంతికల్యాణం చేశారు. భక్తులు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆకాశదీపం, రాత్రి ఏడు గంటలకు పంచహారతులు ఇచ్చారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో దీపారాధన చేశారు. ఆలయ ఈఓ ఎన్. భవాని, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ఆలయంలో స్వామివారికి బిల్వార్చన నిర్వహించనున్నారు.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు పిన్నమనేని హైట్స్ అపార్టుమెంట్‌లో కార్తిక చివరి సోమవారం పూజలను మాజీ జెడ్పీటీసీ కందిమళ్ల అంజనీకుమారి, ఆంజనేయులు దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శివలింగ ప్రతిమను పలు రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. కార్యక్రమ నిర్వాహకుడు కందిమళ్ల ఆంజనేయులు మాట్లాడుతూ డిసెంబరు ఒకటవ తేదీన అమావాస్యను పురస్కరించుకుని స్వామివార్లకు అన్నాభిషేకం, దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.



రామవరప్పాడులో విశేష అలంకరణలో శివయ్య

హనుమాన్‌జంక్షన్ రూరల్: కార్తికమాస సోమవారాన్ని పురస్కరించుకుని బాపులపాడు మండలంలోని పెరికీడు, కానుమోలు, వీరవల్లి, మల్లవల్లి శివాలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. పెరికీడులోని ముక్తికాంత సమేత ముక్తేశ్వరాలయం, వీరవల్లిలోని గంగా పార్వతీ సమేత కొండేశ్వరస్వామి దేవస్థానం, కానుమోలులోని గంగా, బాలత్రిపురసుందరి సమేత సోమేశ్వరస్వామి, మల్లవల్లిలోని నరసింహస్వామి దేవస్థానాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు వైభవంగా జరిగాయి. స్వామివారికి పాలు, నెయ్యి, తేనే, పన్నీరు, విభూది, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలు కన్నులపండువగా నిర్వహించారు. అభిషేక ప్రియుడైన భోళాశంకరుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సహస్ర లింగార్చన, బిల్వార్చనలు నిర్వహించారు. మల్లవల్లి శివాలయంలో భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

గన్నవరం: మండలంలోని శైవ క్షేత్రాలు కార్తిక మాస చివరి సోమవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక కోనాయి చెరువు సమీపంలోని శ్రీకాశీవిశాలాక్షి అన్నపూర్ణదేవి సహిత విశ్వేశ్వరస్వామి దేవస్థానానికి తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. తొలుత ఆలయ అర్చకులు శ్రీకాశీవిశ్వేశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం 108 రజత బిల్వదళాలతో స్వామివారిని అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తిక దీపాలను వెలిగించి పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, పలువురు పుర ప్రముఖులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో వీరవల్లిలోని కొండేశ్వరస్వామి



గన్నవరంలో స్వామివారికి 108 రజత బిల్వదళాలతో అలంకరణ



శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మొక్కల సంరక్షణ సామాజిక బాధ్యత

కంకిపాడు: మొక్కల సంరక్షణ సామాజిక బాధ్యత అని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. పట్టణంలోని ఫ్లైఓవర్ వద్ద వీఎం రంగా సర్కిల్ ప్రాంతంలో తుమ్మల ఆంజనేయులు తనయుడు డాక్టర్ తుమ్మల సాయివెంకట మనోజ్ వితరణతో రూ. 30 వేలు విలువైన మొక్కలను సోమవారం నాటారు. ఎంపీపీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ పర్యావరణ హితం కోసం ప్రతిఒక్కరూ బాధ్యతతో మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నేతలు తుమ్మలపల్లి హరికృష్ణ, ముప్పా రాజా, కంచర్ల చిన్ని, కొప్పరాజు సురేష్, బండి నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

చెస్ విజేతలకు అభినందన

విజయవాడస్పోర్ట్స్: కృష్ణా యూనివర్సిటీ అంతర కళాశాలల చదరంగం పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ఎ. ఉషాప్రవల్లిక, ఎస్. సాధన, ఎస్. సరయు, ఎం. కీర్తి సత్తా చాటి పతకాలు సాధించారని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్, సైన్స్ కాలేజీ క్రీడా విభాగాధిపతి డాక్టర్ టి.వి.బి. కృష్ణారెడ్డి తెలిపారు. వీరిలో ఎ.ఉషాప్రవల్లిక, ఎస్.సాధన దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల చదరంగం పోటీలకు ప్రాతినిధ్యం వహించే కృష్ణా వర్సిటీ జట్టులో చోటు దక్కించుకున్నారన్నారు. ప్రతిష్ఠాత్మకమైన వర్సిటీ చెస్ టోర్నీలో పతకాలు సాధించిన క్రీడాకారులను కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమేష్, డైరెక్టర్ వి.బాబూరావు కాలేజీ ప్రాంగణంలో సోమవారం అభినందించారు.

రైతులు ఆందోళన చెందొద్దు

కంకిపాడు: రైతులు ఆందోళన చెందాల్సిన పరిస్థితి లేదని తహసీల్దార్ వి. భావనారాయణ అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు మోస్తరు జల్లులు మాత్రమే కురిసే పరిస్థితి ఉందన్నారు. తుపాను భయంతో కోతలు ముమ్మరం చేయాల్సిన అవసరం లేదన్నారు. పూర్తిగా ధాన్యం పక్వానికి వచ్చిన తర్వాత కోతలు కోయాలని చెప్పారు. ధాన్యం ఆరబోసి తేమశాతం నిబంధనల మేరకు ఉంటే మద్దతు ధర దక్కుతుందన్నారు. అవసరమైన టార్పాలిన్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆందోళన చెందొద్దని, కోతలను వాయిదా వేసుకోవడం మేలని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

ఉంగుటూరు: అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ యువతి మృతి చెందింది. ఉంగుటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎలుకపాడుకు చెందిన అజ్మీర గోపి కుమార్తె త్రివేణి(18) ఎంఎల్‌టీ పూర్తి చేసి బీఎస్సీ ఎంఎల్‌టీ కోర్సు చేసేందుకు సిద్ధపడుతోంది. ఈ నెల 19వ తేదీన ఇంటిలో బల్లపైన పొలంలో వాడిన పురుగు మందు పెట్టారు. బల్లకింద ఉన్న ఆహార పదార్థాలు ఆమె తిన్న తర్వాత వాంతులు అవడంతో తొలుత గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందింది. బంధువుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా ఎస్ఐ యు. గోవిందు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.